# టైమ్స్ ఆఫ్ వార్త

ఎడిటర్ : గూడూరు జనార్థన్ రెడ్డి

తెలుగు దినపత్రిక

తెలంగాణ | సోమవారం, 22 - జూలై - 2024 | సంపుటి : 16 | సంచిక : 364 | పేజీలు 06 | వెల : 6/-


## అధ్యక్ష బరి నుంచి బైడెన్ ఔట్



**వాషింగ్టన్:** ఇంటా బయటి నుంచి వస్తున్న ఒత్తిడికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఎట్టకేలకు తలొగ్గారు. అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. డెమోక్రటిక్ పార్టీతో పాటు దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ప్రస్తుత అధ్యక్షుడిగా పూర్తి కాలం కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. అధ్యక్ష అభ్యర్థిగా భారత సంతతికి చెందిన కమలా హ్యారిస్‌కు మద్దతు పలుకుతున్నట్లు చెప్పారు. కొంతకాలంగా బైడెన్ అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రచార వేదికల్లో పలు మార్లు తడిబడిన వైనం బహిర్గతమైంది. ట్రంప్‌తో ముఖాముఖి చర్చలోనూ బైడెన్ చాలా వెనకబడ్డారు. ఈ నేపథ్యం లో పార్టీతో పాటు పలువురు ప్రముఖులు, మాజీ అధ్యక్షుడు ఒబామా సైతం బైడెన్ తప్పుకోవాలని సూచించారు.

## కాళేశ్వరంపై కావాలనే కాలయాపన

### మాజీ మంత్రి హరీశ్ రావు

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కమీషన్ల కోసం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వ నిధులను ఎక్కువగా ఖర్చుపెట్టారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బిఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి రాజకీయ విమర్శలు కట్టిపెట్టి కాళేశ్వరాన్ని పునర్ వినియోగంలోకి తేవడంపై శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. ఢిల్లీ వేదికగా ఆయన తన అవగాహ నా రాహిత్యాన్ని బయట పెట్టుకున్నారని ఒక ప్రకటనలో విమర్శించారు. ఒకవైపు మేడిగడ్డ పునాదిని బలపరిచేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం అని అంటూనే మేడిగడ్డ వద్ద మట్టి ప రీక్షలు సాధ్యపడలేదు అని అంటున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది మే 5న ఒక నివేదిక ఇచ్చిన ఎన్‌డిఎస్‌ఎ వర్షాకాలం వరదలు రాకముందే.. జులై మొదటి వారం లోపే పలు సాంకేతిక పరీక్షలు నిర్వహించాలని నివేదిక లో పేర్కొన్నదని అన్నారు.

మిగతా 6లో..

# ఘనంగా లష్కర్ బోనాలు

### మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం

### అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. నెత్తిన బోనమెత్తి వచ్చిన ఆడబిడ్డలు, అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో లష్కర్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజామునుంచే మహాకాళి అమ్మవారి ఆలయానికి భక్తులు బారులు తీరారు. లష్కర్‌లోని అమ్మవారి ఆలయాల వద్ద బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో తెల్లవారుజామున 3.30 గంటలకు ఆలయ అనువంశిక ధర్మకర్తల కుటుంబానికి చెందిన సురిటి రామేశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. పొన్నం ప్రభాకర్ కుటుం బ సభ్యులు అమ్మవారికి బంగారు బోనం, రాష్ట్ర ప్రభు త్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం 8.45 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుటుంబ సభ్యులు అమ్మవారికి పూజలు చేశారు. దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని కోరుకున్నానని మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని



అమ్మవారికి పూజలు చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే అమ్మవారికి ఘనంగా బోనం సమర్పిస్తానని మొక్కుకున్నానని మల్కాజిగిరి



ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు.

# ఎడతెరిపివ్వని వాన

### ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో జలదిగ్బంధం

### నిండుకుండల్లా ప్రాజెక్టులు

### జూరాల నుంచి శ్రీశైలంకు భారీగా వరద నీరు

### భద్రాద్రిలో గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :



మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానతో రాష్ట్రవ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. రాష్ట్రంలోనే కాక, ఎగువన కర్నాటక, చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. గోదావరి ఉ ధృతిగా ప్రవహిస్తుండటంతో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేశారు. జూరాలకు వరద నీరు పోటెత్తడంతో శ్రీశైలంకు భారీగా నీటిని విడుదల చేస్తున్నారు.

### భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయానికి 41.9 అడుగుల వద్ద ప్రవహించిన నీటి మట్టం, రాత్రి 7గంటలకు 43 అడుగులకు చేరింది. దాంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి వల్ల భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఇంకా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. మత్స్యకారులు గోదావరి వద్దకు వెళ్లొద్దని సూచించారు. వరద నీరు పెరగడంతో భద్రాచలం స్నానఘట్టాల ప్రాంతంలోని చాలా మెట్లు నీటిలో మునిగిపోయాయి. ప్రస్తుతం భద్రాచలం వద్ద 9లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్ట్ 25 గేట్లు పూర్తిగా ఎత్తి 75,339 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్ట్ డీఈ తిరుపతి తెలిపారు. చర్ల మండల పరిధిలోని బత్తెనపల్లి సమీప రహదారి వరద బీభత్సానికి తెగిపో వడంతో అరణ్య గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకా కుండా లింగాపురం పాడు చెరువు కట్ట తెగి పంట పొలాలు ధ్వంసం అయ్యాయి.

### పరవళ్లు తొక్కుతున్న కృష్ణ

మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకొంటున్నాయి. కర్నాటకలోని ఆల్మట్టి, నారాయణపుర, ఉజ్జయిని ప్రాజెక్టులు నిండుకుండల్లా మారటంతో దిగువకు పరవళ్లు తొక్కుతున్నాయి. ఆదివారం సాయంత్రం జూరాల ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరడంతో ప్రాజెక్టు 17 గేట్లు తెరిచి దిగువకు 64974 క్యూసెక్కులు, జల విద్యుత్ ద్వారా 31167 క్యూసెక్కుల చొప్పున మొత్తం 100749 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుత 7.798 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లకు గాను ప్రస్తుత నీటిమట్టం 317.580 మీటర్లు ఉ న్నాయి. జూరాల నీటి విడుదలతో శ్రీశైలంకు వరదనీరు పోటెత్తింది. అలాగే, బీమా లిఫ్ట్ ద్వారా 1300 క్యూసెక్కులు, నెట్టెంపాడు ద్వారా 1500 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 870, కుడి కాలువ ద్వారా 596 టీఎంసీల నీటిని దిగువకు వదులుతున్నారు.

### చత్తీస్‌గఢ్, ఒడిశాలకు రాకపోకలు బంద్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో గోదావరి పరివాహకంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. తెలంగాణ-చత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన టేకులగూడెం సమీపంలో 163వ జాతీయ రహదారిపై వరదనీరు చేరడంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలు వెళ్లకుండా ట్రాక్టర్లు, ట్రక్కులు అడ్డుపెట్టారు. చర్ల మండలం వద్ద ఈత వాగుపై నుంచి వరద నీరు పారడంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దుమ్ముగూడెం మండలం వద్ద సీతవాగు, గుబ్బల మంగి వాగు

మిగతా 6లో..

## డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షాలకే ఇవ్వాలి

### పార్లమెంట్‌లో ప్రజల గొంతు వినిపించాలి

### దేశ సమస్యలపై చర్చించాలి : అఖిలపక్ష సమావేశంలో విపక్షాలు ప్రత్యేక హౌదాలపైనా డిమాండ్

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వేదికగా తమ గొంతు వినిపించేందుకు అవకాశం ఇస్తామన్న భరోసా ప్రభుత్వం కల్పించాలని ప్రతిపక్షాలు కోరాయి. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షాలకు ఇవ్వాలని డిమాండ్ చేశాయి. నేటి నుంచి పార్ల మెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఆదివారం ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రతిపక్షాలు నీట్ పేపర్ లీక్, నిరుద్యోగం, ధరల పెరుగుదల, అగ్నివీర్ పథకం రద్దు, లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి, కన్వయర్ యాత్ర వివాదం వంటి పలు అంశాలను లేవనెత్తాయి. దీనికి ముందు పార్లమెంట్ సమావేశాల నిర్వహ ణకు సహకరించాలని ప్రభుత్వం అన్ని పక్షాలను కోరింది. ఉభయ సభలు సజావు గా సాగేందుకు ప్రతిపక్షాల సహకారం కావాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కోరిన తర్వాత, సమస్యలను లేవనెత్తడానికి ప్రతిపక్షాలను అనుమతించాలని కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోరు అన్నారు. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు కేటాయి ంచాలని, ఈ పదవిని ఖాళీగా ఉంచడం సమంజసం కాదని సూచించారు. బీహార్‌కు ప్రత్యేక హోదాపై ఆర్‌జేడీ, జేడీయూ, ఎల్‌జేపీ, ఏపీ కోసం వైసీపీ, అలాగే ఒడిశా కోసం బీజేడీ డిమాండ్ చేశాయి. మరోవైపు ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలని ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షం టీడీపీ డిమాండ్ చేయకపోవడాన్ని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ తప్పుపట్టారు. ఈ విషయంపై టీడీపీ ఎందుకు మౌనం వహించిందని ప్రశ్నించారు. ఎన్నికల అనంతరం ఏపీలో చెలరేగుతున్న హింస, ప్రతిపక్షంపై దాడులను వైసీపీ ప్రస్తావించింది. ఈ సమావేశంలో ప్రభుత్వం తరపున కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిరణ్ రిజిజు హాజరు కాగా, కాంగ్రెస్ నేతలు జైరాం రమేష్, గౌరవ్ గొగోరు, కె సురేష్ హాజరయ్యారు. టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, గండి హరీష్, జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌ రి, వైసీపీ ఎంపీలు విజయసాయి రెడ్డి, మిథున్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ కె.ఆర్ సురేష్ రెడ్డి, డీఎంకే ఎంపీలు టి.ఆర్. బాలు, తిరుచ్చి శివ, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్, ఎల్‌జేపీ నేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, అనుప్రియ పటేల్, ఎస్‌పీ ఎంపీ రాం గోపాల్ యాదవ్, ఆప్ ఎంపీ సంజరు సింగ్, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసి, ఎన్‌సీపీ నేత ప్రఫుల్ పటేల్, ఆర్‌జేడీ ఎంపీ

మిగతా 6లో..

## ఎడపల్లిలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు..

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి





గురుపౌర్ణమి పర్వదినాన్ని పు రస్కరించుకొని ఆదివారం ఎ డపల్లి మండల కేంద్రంలో గల సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎడపల్లి మండల కేంద్రం లో గల సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని రంగురంగుల పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ మేరకు ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, ఇంచార్జి మండల విద్యాశాఖాధికారి రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ రథంలో సాయిబాబా చిత్రపటాన్ని ఉంచి గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో మహిళలు దాండియా ఆడుతూ భక్తి పాటలు పాడుతూ శోభయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.... గురువుల ఆశీస్సులతోనే ఎంతవారైన కూడా తమ గమ్యస్థానాలకు చేరుకునే వీలుకలుగుతుందని, గురువులను పూజించుకోవడం గొప్పవరమని అన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ శ్రీనివాస్ ఎంఈఓ రామారావులతో పాటు ఎందరినో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న పలువురు ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వర శర్మ సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆలయానికి విచ్చేసిన భక్తులు,అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ సమతుల్యతకు చెట్లు దోహదం



టైమ్స్ ఆఫ్ వార్త-మందమర్రి

ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని, పర్యావరణ సమతుల్యానికి చెట్లు దోహదపడతాయని ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీముద్దీన్ తెలిపారు. ఆదివారం సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఒర్రెగడ్డ లో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అజీమోద్దీన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించినట్లయితే పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి ఇళ్లల్లో మొక్కలు నాటి, భవిష్యత్ తరాలకు చక్కటి పర్యావరణాన్ని, కలుషితం లేని ప్రాణవాయువును అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవ్, కార్యదర్శి గాండ్ల సంజీవ్ పటేల్, పట్టణ అధ్యక్షుడు నందిపాట రాజు, సభ్యులు జావిద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## అంటూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలి



టైమ్స్ ఆఫ్ వార్త-మందమర్రి

వర్షాకాలం అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని,ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు సూచించారు.పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని వార్డ్ నెంబర్ 22,పాత పోలీస్ స్టేషన్, పాత ఫిల్టర్ బెడ్ ఏరియాలలో ఆదివారం ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ, పరిసరాల పరిశుభ్రత తోపాటు అంటు వ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యల పై ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ,దోమలు,ఈగలు లార్వా పెరగకుండా వర్షాకాలంలో రాబోయే సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఇంటిలో ఉపయోగం లేని ఎయిర్ కూలర్, ఫ్రిడ్జ్ లలో నీటి నిలువ చేరకుండా చూసుకోవాలన్నారు.పగిలిపోయిన కుండలు, ప్లాస్టిక్ డబ్బాలలో చాలా కాలం నుండి నిల్వ ఉంచిన నీళ్లను, అదేవిధంగా ఇంటి పరిసరాలలో నిలువ ఉన్న ఇతర మురికినీటిని ఖాళీ చేసి,ఇండ్లకు దూరంగా పారవేయాలని సూచించారు.వాడి పారేసిన కొబ్బరి బొండాలు,పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి ట్యాంకులు, బకెట్లు, డ్రమ్ములు మొదలైన వాటి మీద మూతలు సరి చూసుకోవాలని సూచించారు.దోమలు,ఈగల నుండి వచ్చే చికెన్ గున్యా,డెంగ్యూ మొదలగు వ్యాధులు ప్రజలకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ వి శ్యాంసుందర్, మెప్మా ఆర్పీ లు తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీటి దాటి నుండి కాపాడండి

### ఇందు కాలనీ ప్రజల వేడ్కోలు



టైమ్స్ ఆఫ్ వార్త-మందమర్రి

ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పట్టణంలోని ఇందు గార్డెన్ సమీపంలోని ఇందు కాలనీ నీటిమయం అయిందని, వర్షపు నీటి దాటి నుండి తమ కాలనీని కాపాడాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు. ఆదివారం కాలనీ వాసులు విలేకరులతో మాట్లాడుతూ, పట్టణంలోని ఇందు గార్డెన్ సమీపంలో నూతనంగా సుమారు 150 మంది ఇండ్లు నిర్మించుకొని, కాలనీ గా ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలను కారణంగా కాలనీ మొత్తం నీట మునిగి, కాలనీ వాసులు నిత్యావసర సరుకులకు, ఇతర అవసరాలకు బయటకు వెళ్ళలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించి, వర్షపు నీరు పోయే విధంగా చర్యలు తీసుకొని, కాలనీని వర్షపు నీటి దాటి నుండి కాపాడాలని మొరపెట్టుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు చిప్ప సత్తనారాయణ, పింగిడి సమ్మిరెడ్డి, కుమ్మరి మల్లయ్య, శంకరయ్య, మేక శంకరయ్య యాదవ్, రాజేందర్, వి, ఐలయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పశాంతంగా సింగరేణి ఉద్యోగ నియామక పరీక్షలు



**రెండు రోజులపాటు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు**

**హైదరాబాద్లో 12 కేంద్రాల్లో పకడ్బందీగా నిర్వహణ**

**త్వరలోనే కీ విడుదల**

**సింగరేణి సిఎండి బలరాం**

టైమ్స్ ఆఫ్ వార్త-మంచిర్యాల జిల్లా ప్రతినిధి

సింగరేణిలో 272 ఖాళీల భర్తీకి జూలై 20, 21న హైదరాబాద్ లోని 12 పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరామ్ ఆదేశాల మేరకు తొలిసారిగా హైదరాబాద్ కేంద్రంగా ఈ పరీక్షలను అత్యంత పటిష్టంగా, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నిర్వహించారు. జూలై 20న మూడు షిఫ్టులలో జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, మేనేజ్మెంట్ ట్రెయినీ ఎఫ్ అండ్ ఏ, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, మేనేజ్మెంట్ ట్రెయినీ హైడ్రోజియాలజిస్ట్, మేనేజ్మెంట్ ట్రెయినీ సివిల్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, మేనేజ్మెంట్ ట్రెయినీ ఐఈ, సబ్ ఓవర్ సీర్ ట్రెయినీ సివిల్ పోస్టులకు పరీక్ష నిర్వహించగా, మొత్తం 11724 అభ్యర్థులకు గాను 7073 అభ్యర్థులు హాజరు కాగా హాజరు శాతం 60.53 శాతంగా నమోదైంది. అదేవిధంగా జూలై 21న రెండు షిఫ్టులలో మేనేజ్మెంట్ ట్రయినీ మైనింగ్, మేనేజ్మెంట్ ట్రయినీ పర్సనల్ పోస్టులకు పరీక్ష నిర్వహించగా మొత్తం 6931 అభ్యర్థులకు గాను 4972 అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా హాజరు శాతం 71.73శాతంగా నమోదైంది. మొత్తం 18665 మందికి హాల్ టికెట్లు జారీ చేయగా,12045 మంది పరీక్షలకు హాజరు కాగా దాదాపు 65 శాతం హాజరు శాతం నమోదైంది. పరీక్ష కేంద్రాలను ఆదివారం సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్, పర్సనల్, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్వికే శ్రీనివాస్ లు సందర్శించి, పరీక్ష నిర్వహణలో పాటిస్తున్న జాగ్రతలను సమీక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ పరీక్షల ప్రాథమిక సమాధాన పత్రాన్ని (కీ) త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షల సందర్భంగా పూర్తి పారదర్శకంగా బయోమెట్రిక్, ఐరిష్ పరికరాల ద్వారా అభ్యర్థుల వివరాల నమోదు, తనిఖీ చేపట్టామని, సిసి కెమెరాల నిఘా మధ్యన విజయవంతంగా పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షల నిర్వహణలో ఎవరి ప్రమేయం ఉండదని, ఎటువంటి రికమండేషన్ లకు తావు ఉండదని మరో మారు స్పష్టం చేశారు. పూర్తి పారదర్శకంగా ఉద్యోగ నియామక పక్కా నిర్వహిస్తున్నందున సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా మోసగాళ్లు మాయ మాటలు చెప్తే, నమ్మి మోసపోవొద్దని, అటువంటి వారి వివరాలను సింగరేణి విజిలెన్స్ విభాగానికి, పోలీస్ శాఖ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## పాఠశాలల పరిసరాలలో చిరుతిళ్ళ దుకాణాలను ఉండనివ్వద్దు



టైమ్స్ ఆఫ్ వార్త-మంచిర్యాల జిల్లా ప్రతినిధి

పాఠశాలల పరిసర ప్రాంతాల్లో జంక్ ఫుడ్, ఇతర చిరుతిళ్ళ దుకాణాలను ఉండనివ్వద్దని రైట్ టు హెల్త్ ఫోరం,తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది రాజలింగు మోతే డిమాండ్ చేశారు. ఆదివారం జాతీయ జంక్ ఫుడ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని రామకృష్ణాపూర్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,చిన్నారుల జీవితాన్ని చిరుతిళ్ళు శాసిస్తున్నాయని, మార్కెట్లోని చిరుతిళ్ళు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతు న్నాయన్నారు. భారత ప్రమాణాల భద్రత సంస్థ నిబంధనల ప్రకారం పాఠశాలలు, విద్యార్థుల వసతి గృహాలకు 50 మీటర్ల దరిదాపుల్లో చిరుతిళ్ల దుకాణాలు ఉండకూడదని, క్యాంటీన్లో మిఠాయిలు, చిప్స్, పిజ్జా, సమోసాలు, బర్గర్లు, నూడుల్స్, గులాబ్ జామున్, శీతల పానీయాలు విక్రయం నిషేధమని తెలిపారు. ఈ నిబంధనలు ఎక్కడ అమలు కావడం లేదన్నారు. చిరుతిళ్ళ దుకాణాల వద్ద లభించే ఆహార పదార్థాలను పిల్లలు ఎక్కువగా ఇష్టపడుతున్నారని, పాఠశాలల వద్ద సైతం జంక్ ఫుడ్ కోసం పిల్లలు పరుగులు పెడుతున్నారని, వాటి వల్ల చిన్నారులు ప్రమాదంలోకి మెట్ట బడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 10 ఏండ్లల్లో పిల్లల ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయని, సరైన సమయానికి, సరైన ఆహారం తినడం లేదని తెలిపారు. పిల్లలకు జంక్ ఫుడ్ ను నివారించి, పీచు, బలవర్ధక పదార్థాలు ఇవ్వాలన్నారు. పాఠశాలల పరిసరాలలో జంక్ ఫుడ్ ఉండనివ్వకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

## కారు ఆటో డీ.

### ఇద్దరు దుర్మరణం, పలువురికి గాయాలు.

### మానవత్వం చాటుకున్న చింతకాని సబ్ ఇన్స్ స్పెక్టర్ మరియు వారి బృందం.



టైమ్స్ ఆఫ్ వార్త-చింతకాని

జగన్నాధపురం నామవరం క్రాస్ రోడ్డు మధ్యలో కారు మరియు ఆటో ఎదురెదురుగా గుద్దుకోగా ఆటో పూర్తిగా నుజ్జు నుజ్జయిపోయింది .దానిలో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి తన కాళ్లు నుజ్జు నుజ్జు అయ్యి అక్కడకక్కడే మరణించా డు. 108 లో తరలిస్తున్న ఉండగా మరో వ్యక్తి మరణించారు. గాయపడినటువంటి మరికొందరని సబ్ ఇన్స్పెక్టర్ నాగుల మిరా మరియు వారి బృందం వారికి అందిన సమాచారం మేరకు తక్షణమే ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకొని గాయాలు అయినటువంటి వారిని అంబులెన్స్ ద్వారా ప్రైవేటు వాహనముల ద్వారా వారు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. చనిపోయిన వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం పంపించడం జరిగింది. కానీ పోలీసు వారు చేసిన ఇంత గొప్ప సహాయమును అక్కడున్న ప్రజలు చూసి ఆశ్చర్యపోయారు. పోలీస్ వారై ఉండి వారే తన చేతులతో పతి లో పడినటువంటి వారిని రోడ్డుపై తీసుకొని వచ్చి ఆసుపత్రికి తరలించడం పట్ల అనేకమంది ప్రజలు వారి సేవకు కొనియాడారు .మరి కొంతమంది హర్షం వ్యక్తం చేశారు. ప్రమాదం ఎలా జరిగిందో విచారించి కేసు నమోదు చేస్తానని సబ్ ఇన్స్పెక్టర్ చెప్పారు..

## సింద్రాబాద్ మహంకాళి అమ్మ వారిని దర్శించుకున్న చేవెళ్ల ఎం.ఎల్.ఏ కాలే యాదయ్య



శంకర్ పల్లి 21

సికింద్రాబాద్ లోని మహంకాళి అమ్మ వారిని చేవెళ్ల ఎం ఎల్ ఏ యాదయ్య ఆది వారం అ నుచరులు తో దర్శించు కున్నారు అమ్మ వారి ఆశీస్సులు అందరి పై ఉండాలని బోనాల పండుగ ప్రతి ఇంట సంతోషం గా జ రు పు కోవాలని ఆయన అ న్నారు ఆలయ దర్శనం లో యాదయ్య తో పాటు గుత్తి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ పై ప్రొద్దుటూరు గ్రామంలో అంబరాన్నంటిన సంబరాలు..



### సీఎం చిత్రపటానికి పాలాభిషేకం.

టైమ్స్ ఆఫ్ వార్త-చింతకాని

మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకధాటిగా రెండు లక్షల రుణమాఫీ పథకాన్ని అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ గ్రామంలో శనివారం కాంగ్రెస్ నాయకులు రైతులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫ్లెక్సీ కి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అధికారం చేపట్టిన 8 నెలల్లో అమలు చేసిందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయలు రుణమాఫీని విడుతల వారీగా ఇవ్వడంతో వడ్డీలకే సరిపోయాయని అన్నారు. ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రుణమాఫీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ పిన్నం బ్రహ్మచారి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీరామ మఠంలో గురుపూజోత్సవ వేడుకలు..



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



గురుపౌర్ణమి పురస్కరించుకుని ఎడపల్లి మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీరామ మఠంలో గురుపూజోత్సవ కార్యక్రమాలు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆదివారం మఠంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి బోధన్, బాన్సువాడ, నిజామాబాద్, హైదరాబాద్, ఎడపల్లి తదితర ప్రాంతాల నుండి భక్తులు విచ్చేసారు. ఈ సందర్భంగా శ్రీరామమఠం పీఠాధిపతి, శ్రీరామదాసి వంశజులు జయరాం మహరాజ్ దంపతులకు వారు పాదపూజ నిర్వహించి ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులు భజన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 400సంవత్సరాల క్రితం నాటి శ్రీరామ మఠంలో ప్రతీ సంవత్సరం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరశురాం మహరాజ్, శ్రీపాదశర్మ, ధను మహరాజ్, భక్తులు నటరాజ్ గౌడ్, శంకర్ బాబా,పాల్గొన్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం,
22-07-2024


# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే మార్నింగ్ వాక్

**మాజీ మంత్రి వర్యులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి**

**ఎప్పుడూ జనం మధ్యలో ఉండే నాయకుడు దామన్న.**

**రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి**

**సూర్యాపేట ప్రజలు అంటే ఏనలేని ప్రేమ, చెప్పింది చేస్తాడు**

**కక్కిరేణి శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్**



టైమ్స్ ఆఫ్ వార- సూర్యాపేట జిల్లా ప్రతినిధి

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసమే మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నామని మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు.ఆదివారం సూర్యాపేట పట్టణంలో మార్నింగ్ వాక్ కార్యక్రమం లో భాగంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న 44వవార్డు కొత్త బస్టాండ్ వద్ద 5 లక్షల వ్యయం తో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ కాలువను పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి దామోదర్ రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలోని ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు మార్నింగ్ వాక్ కార్యాక్రమాన్ని చేపట్టానని,ప్రజలకు చేరువగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతున్నదని న్నారు. స్థానికులతో కలియ తిరిగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడం కాకుండా అక్కడికక్కడే కొన్ని సమస్యలను పరిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి మాట్లాడుచూ గతంలో నాయకులు ఎన్నికల సమయంలోనే పట్టణాలకు వస్తే దామన్న మాత్రం నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల సాధనకు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలను అర్హులకు అందించడమే లక్ష్యంగా దామన్న పని చేస్తున్నాడని అన్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్థానిక కౌన్సిలర్ కక్కిరేణి శ్రీనివాస్ మాట్లాడుచూ కోరిన వెంటనే తన వార్డులో ఉన్న డ్రైనేజీ కాల్వ కట్టించి స్లాబ్ వేపించి 4 సంవత్సరాలనుండి ఉన్న సమస్య ను పరిష్కరించి నందుకు ప్రజల తరుపున దామన్న కు ధన్యవాదాలు తెలిపారు...ఇట్టి కార్యక్రమంలో ,పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, కౌన్సిలర్ లు బైరు, శైలేందర్, కుంభ%శీ% రాజేందర్, ఆనంతుల యాదగిరి,చిరివెళ్ల శభరీ మరియి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహాలక్ష్మి అమ్మవారికి బోనం ఎత్తిన ఎమ్మెల్యే ధన్పాల్



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

వినాయక్ నగర్ లక్ష్మి సిల్క్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాలక్ష్మి అమ్మ వారి బోనాల పండుగ ఊరేగింపు కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధన్పాల్ మాట్లాడుతు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ పండుగలలో ఒకటి బోనాల పండుగని రాష్ట్ర వ్యాప్తంగా ఆశడమాసంలో ప్రజలందరు భక్తి శ్రద్దలతో బోనం చేసి అమ్మవారిని కొలవడం అనవయితీగా వస్తుందని, భక్తి శ్రద్దలతో అమ్మవారిని పూజలు చేసి, నైవేద్యం సమర్పించడం జరుగుతుందని, సకాలంలో వర్షాలు కురిసి రైతన్నలు అధిక పంటలు పండించాలని పిల్లజల్లా, గొడ్డు గోదా అన్నింటిని కాపాడాలని అమ్మవారిని పూజించడం జరుగుతుందని, స్వయంగా అమ్మవారే తమ ఇంటికి వచ్చినట్లు భక్తులందరు భావిస్తారని అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే అని అమ్మవారు ఇందూర్ నగర ప్రజలందరిని అష్టఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ అమ్మవారి ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ పంచారెడ్డి లావణ్య, లింగం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మి నారాయణ, ప్రభాకర్, ఆనంద్, పవన్, కార్తీక్, ముందడ పవన్, సతీష్, హరీష్, కృష్ణ, బాబీ సింగ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు..



టైమ్స్ ఆఫ్ వార్త-మందమర్రి

గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాయిబాబా దేవస్థానం, అమ్మ గుడిలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక్క పూజలు, కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ,భారతీయ సనాతన ధర్మానికి ఆధారైన జ్ఞానాన్ని మానవులకు అవసరమైన రీతిలో నాలుగు వేదాలుగా విభజించి,వాటితో పాటు పంచమ వేదంగాను పిలువబడే మహాభారతాన్ని,18 పురాణాలను,భాగవతాన్ని ఆధ్యాత్మిక జ్ఞాన రూపంలో జీవన విధానాన్ని అందించిన మహర్షి వేద వ్యాసుని జన్మదినమైన ఆషాడ పౌర్ణమి రోజున గురుపూర్ణమి జరుపుకుంటామని తెలిపారు. వేదవ జయంతి ఉత్సవాలైన గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని అమ్మ గుడిలో సతీష్ భవాని ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా గురుమహత్య విశ్లేషణ సత్సంగం,యజ్ఞం, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ వచ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈసందర్భంగా ఆధ్యాత్మిక గురువు సతీష్ భవాని ని ఘన శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మానవులకు సుఖమైన, ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించే యోగ,శాఖాహార ప్రాముఖ్యతను ప్రచారం చేయడంతో పాటు నిత్యం యోగా అభ్యాసంతో మంచి యోగా గురువుగా ప్రసిద్ధికెక్కి ఎన్నో ఉత్తమ యోగాభ్యాసిగా, యోగ మాస్టర్ గా పలు సంస్థల సత్కారాలు పొందిన కొంపల్లి రమేష్ ను,ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, ఆధ్యాత్మిక ప్రసంగికులు, వ్యాస రచయిత,పలు కార్యక్రమాల వ్యాఖ్యాత నోముల చంద్రశేఖర్ ను సైతం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు ఉప్పలంచి చంద్రకాంత్, దాసరి శ్రీకాంత్, మాచర్ల వెంకటస్వామి, సాగర్, కిషోర్, సంపత్, మార్కండేయ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ కార్గే జన్మదిన వేడుకలు

టైమ్స్ ఆఫ్ వార్తు- బాన్సువాడ



అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గే 82వ దినోత్సవాన్ని వర్ని మండలం పాత వర్ని గ్రామంలో ఆదివారం ఘనంగానిర్వహించడం జరిగింది. ఖర్గే కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గొప్పవని వారికి ఆభగవంతుడు ఆయురారోగ్యాలను మనస్పూర్తిగా కోరుకుంటూ కేక్ కట్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎలమంచిలి శ్రీనివాసరావు, వర్ని మండల మాజీ ఎంపీపీ చింగ్లీ బద్య నాయక్,జాకోర సొసైటీ అధ్యక్షులు దశరథ్, వర్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీర్కూరు మొగలయ్య ఉపాధ్యక్షులు వాల్తేరు వీరయ్య, కల్లూరి జీవన్, సాదుల రవి,దర్శనం పెద్ద సాయిలు, బొగ్గుల రాములు, సొసైటీ డైరెక్టర్ గంగప్ప, సీనియర్ నాయకులు నారా గౌడ్, అనంతరావ్, పెరిక సుధాకర్, జైకర్ శివకుమార్, మోస్రా వీరేశం, మొండి భూమయ్య, కులకర్ణి వినోద్, సోషల్ మీడియా ఇన్చార్జ్ మావురం రాజు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు,

## లిఫ్ట్ ఇరిగేషన్ సిబ్బంది సమస్యలపై అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం..

**ఈఎస్ఐ, పిఎఫ్, గుర్తింపు కార్డులను మంజూరు చేయాలి...**

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి




నిజామాబాద్ జిల్లా గుత్ప, అలిసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, ఆది వారం అంబేద్కర్ విగ్రహానికి కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా లిఫ్ట్ ఇరిగేషన్ సిబ్బంది 5నెలల పెండింగ్ జీతాలు ఇప్పించాలని,తమ సమస్యలు,వెంటనే పరిష్కారం చేయాలనీ కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ... జిల్లాలో అలీసాగర్ ఆయకట్టు, గుత్ప ఆయకట్టులో రైతులకు వున్న 80వేల ఎకరాలకు సాగునీరు త్రాగునీరు అందిస్తు, నిరంతరం విషసర్పల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విదులు నిర్వర్తిస్తున్నామని వారు అన్నారు. చాలిచాలని వేతనాలు తీసుకుంటు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నమని తెలిపారు. 5నెలల పెండింగ్ వేతనాలు ఇప్పించాలని, ఈఎస్ఐ, పిఎఫ్, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు, గణేష్, సభ్యులు నరేష్, మహిపాల్, గణేష్, సునీల్, రూపేష్, కార్తీక్, బుచ్చన్న, రవి, సీతారాం, కార్మికులు, తదితరులు,పాల్గొన్నారు.

# నారాయణపురం లో పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేయాలి

**పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఉప్పల ఆంజనేయులు,**

**కార్యదర్శి గునిగంటి రాజు**

టైమ్స్ ఆఫ్ వార్త - సంస్థాన్ నారాయణపురం



సంస్థాన్ నారాయణపురంలో పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేయాలని నారాయణపురం పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఉప్పల ఆంజనేయులు,కార్యదర్శి గునిగంటి రాజు ప్రభుత్వాన్ని కోరారు.ఆదివారం నాడు వారు విలేకరులతో మాట్లాడుతూ సంస్థాన్ నారాయణపురంలో గతంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలనుకున్నప్పుడు అనుకోని పరిస్థితుల గురుకులం వేరే గ్రామానికి తరలించరని చెప్పారు.ప్రస్తుతం పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేసినట్లయితే నారాయణపురం చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని,ముఖ్యంగా గ్రామం అభివృద్ధి చెందుతుందని నారాయణపురంలో యువత గంజాయి,డ్రగ్స్,మద్యానికి బానిసలై ఉన్నారని పోలీస్ బెటాలియన్ ఏర్పడినట్లయితే శాంతి భద్రతలు అదుపులో ఉండి యువత మంచి మార్గంలో వెళ్తారని తెలియజేశారు. ముఖ్యంగా గ్రామం అభివృద్ధి చెందుతుందని గ్రామంలో ని ప్రజలకు జీవనోపాధి కలుగుతుందని,దీనివల్ల మునుగోడు నియోజకవర్గం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.ఈ పోలీస్ బెటాలియన్ ఏర్పడినట్లయితే ఈ భూమిని నమ్ముకొని 70 సంవత్సరాల నుండి వ్యవసాయం చేసుకుంటున్న నిరుపేద వ్యవసాయ కుటుంబాలకు నష్టం జరుగుతుందని నష్టపోయిన కుటుంబాలకు మరొక స్థానంలో భూమిని కేటాయించాలని వారికి జీవనోపాధిని కల్పించాలని తెలంగాణ ముఖ్యమంత్రికి రేవంత్ రెడ్డికి,మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.ఈ యొక్క కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ కార్యదర్శి గునిగంటి రాజు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కట్ట మైసమ్మ బోనాల జాతరలో పాల్గొన్న చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భీమ్ భరత్

**శంకర్‌పల్లి: జూలై 21**



శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 11 వ వార్డులో గల కట్ట మైసమ్మ బోనాల జాతరలో ఆదివారం చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీమ్ భరత్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శేరి ఇంద్రసేనారెడ్డి, షేరి అనంతరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎజాస్, నాయకులు రవీందర్ రెడ్డి, ప్రశాంత్ కుమార్, బలవంత రెడ్డి, కృష్ణారెడ్డి, వడ్డే మల్లికార్జున్, వడ్డే శ్రీకాంత్, వడ్డే శివ సాయి ఉన్నారు.

## సీఎంకు పాలభిషేకం..



టైమ్స్ ఆఫ్ వార్త-బిక్కనూర్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రెండు లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా పెద్ద మల్లారెడ్డిలో కా ంగ్రెస్ నాయకులు రేవంత్ రెడ్డికి పా లభిషేకం నిర్వహించారు. ఈ కా ర్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు టెంట్ హౌస్ స్వామి, నాయకులు బాగా రెడ్డి, సురే ందర్ రెడ్డి, ఎల్లం రెడ్డి, వడ్ల శ్రీనివాస్, పిల్లి సంతోష్, గజ్జల బాబు, అనిల్, ఇస్తారి, పోచమ్మ బాబు, మంగలిబాబు, మంగలినర్సింహులు, బుచ్చయ్య, చిన్నోళ్ల నరసింహులు, సత్తురి ఎల్లం, ఆకుల నర్సింలు , రైతులుతదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## ఆగ్రో చైర్మను సన్మానించిన కుర్మా సంఘ నాయకులు..



టైమ్స్ ఆఫ్ వార్తు-బాన్సువాడ

బాన్స్ వాడ నియోజక వర్గంలో బాన్స్ వాడ మండల కురుమ సంగము తరుపున గ్రామ తెలంగాణ అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ ని కలిసి ఆదివారం సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమములో సొసైటీ చైర్మెన్ బాన్స్ వాడ నియోజక వర్గ ఇంచార్జ్ గంగుల గంగారాం , జిల్లా కార్యదర్శి పార్వయ్య , మండల అధ్యక్షులు బీరుగొండ, సొసైటీ డైరెక్టర్ పి. మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ టి. అంజయ్య, హనుమాన్ మందిర్ చైర్మన్ సాయిలు, యూత్ ప్రెసిడెంట్ కురుమ గణేష్ గౌండ, ఎస్. అంజయ్య, ఎం. సాయిలు, కురుమ గజేందర్, కురుమ బీరుగొండ, సత్యనారాయణ, గంగాధర్ ,కురుమ పెద్ద గంగాధర్, తదితరులు, పాల్గొన్నారు.

## ముువ్వాను కలిసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



చంద్రుగొండ టైమ్స్ అఫ్ వార్త

తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న మువ్వా విజయబాబును అంకిరెడ్డి కృష్ణారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాదులో నిర్వహించిన పదవి బాధ్యత స్వీకరణ మహోత్సవ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, చైర్మన్ మువ్వ విజయ్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చనిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే హైదరాబాదులో ఉన్న పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డిని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరావును, కూడా కలిసి మండలంలో ఉన్న పలు సమస్యలను వాళ్ళ ఇరువురి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు తుమ్మలపల్లి సురేష్, నాయకులు నెల్లూరు ప్రసాద్, నన్నక సంపత్, చలపతిరావు, నున్న వెంకటేశ్వరరావు, రాయల రమేష్, మండల నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

TIMES OF VARTHA (22-07-24)M_times of varha main (13-2).qxd 7/22/2024 6:28 AM Page 4



## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**- సాయిబాబా ఆలయంలో పంచామృత అభిషేకం**

**- భక్తులందరికీ భారీ అన్నదాన కార్యక్రమం**

చంద్రుగొండ టైమ్స్ ఆఫ్ వార్త

గురు పౌర్ణమిని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలోని శిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే సాయిబాబా ఆలయంలో వేడుకలు ప్రారంభమయ్యాయి. భక్తులందరూ తమ స్వహస్తాలతో స్వామివారికి క్షీరాభిషేకలు చేశారు. భక్తులందరూ క్షీరాభిషేకాలు చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై స్వామివారిని కూర్చోబెట్టి సాయి కీర్తనలతో గ్రామంలో పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను పంపిణీ చేసి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమాలను ఆలయ పురోహితులు విప్పర్ల వేణు శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీదెళ్ల పవన్ కుమార్, కమిటీ సభ్యులు, భక్త బృందం, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తితో,విద్యార్థిని ఆత్మహత్య.



టైమ్స్ ఆఫ్ వార్త - మాక్లూర్.

జీవితంపై విరక్తితో,విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఉదాంతం వెలుగు చూసింది . మాక్లూర్ మండల మానిక్ బండార్ తాండా డివిజన్ 2 కు చెందిన బానావత్ దివ్య, అనే 20 సంత్సరాల విద్యార్థిని, కంటిచూపు సరిగ కనిపించక, మానసిక స్థితి సరిగలేక, ఆదివారం,21- 7 -2024.తన ఇంటిలోనే, కిటికీకి ఉదయం దాదాపు 9 గంటల 15 ని.కు, చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నదని, మాక్లూర్ పిఎస్ ఏఎస్ ఐ గంగాధర్ తెలిపారు. మృతురాలి తండ్రి బానావత్ అమర్ సింగ్ పిర్యాదు మేరకు, కేసునమోదు చేసుకొని,మృత దేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించ్చినట్లు ఏ ఎస్ ఐ గంగాధర్ తెలిపారు.

## సీతారామ నీళ్లు భద్రాద్రి జిల్లా రైతులకు అందించాలి

**- పాత డిజైన్లు మార్చి కొత్త డిజైన్ తో జిల్లాకు అన్యాయం చేస్తున్నారు**

**- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ**

చంద్రుగొండ టైమ్స్ ఆఫ్ వార్త




సీతారామ ప్రాజెక్టు నీళ్లు భద్రాద్రి జిల్లాకు ఇచ్చిన తర్వాతనే పక్క జిల్లాలకు నీళ్ళు తరలించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో సీతారామ ప్రాజెక్టు నీళ్లు జిల్లా రైతులకు అందించాలని. డిమాండ్ చేస్తూ చంద్రుగొండ మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయక కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్కే ఉమర్ మాట్లాడుతూ... ఆంధ్ర పాలకులు గోదావరి నీళ్లను తరలిస్తుంటే నీళ్లు, నిధులు, నియామకాల, పేరుతో జరిగిన తెలంగాణ ఉద్యమంతో రాష్ట్రాన్ని సాధించుకున్నామని. సాధించుకున్న ఈ తెలంగాణ రాష్ట్రంలో కూడా సీతారామ ప్రాజెక్టు నీళ్ల విషయంలో అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కొట్లాడి తెచ్చుకున్న సీతారామ ప్రాజెక్టు నీళ్లను అన్యాయంగా ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు తరలిస్తున్నారని. భద్రాద్రి జిల్లాలో ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వకుండా కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ నీళ్ళు అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, మండలాల మీదుగా వెళుతున్న కూడా ఈ మండలాల ప్రజలకు చుక్కనీరు ఇవ్వకపోవడం ఆంతర్యం ఏమిటని మంత్రులను ప్రశ్నించారు. పాత డిజైన్లను మార్చి కొత్త డిజైన్లు తీసుకొచ్చి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఏజెన్సీ మండలాల ప్రజలపై, రైతులపై, వీరికి ఎంత ప్రేమ ఉందో ఇట్లే అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా కొత్త డిజైన్లు మార్చి పాత డిజైన్ లో నిర్మించి. ఈ జిల్లాలో ఉన్న ఏజెన్సీ గిరిజన రైతులకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి వరికూటి వెంకట్రావు, ఎర్నం శ్రీనివాసు, రాజేష్, మోహన్, సత్యనారాయణ, కిషన్, మంగ్య, బాలు, తదితరులు, పాల్గొన్నారు.

## కొండ గోపి కి సన్మాన కార్యక్రమం.



టైమ్స్ అఫ్ వార్త చింతకాని

చింతకాని మండలంలో వర్షం శాతం లెక్కచేయకుండా బిజెపి మండల అధ్యక్షులు కొండ గోపి కి సన్మాన కార్యక్రమం చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో చిన్న మండవ గ్రామం, రామకృష్ణాపురం గ్రామం ,పలు గ్రామాలలో యువకులు సన్మానం చేయడం జరిగింది.

## శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఆవరణలో గురు పౌర్ణమి వేడుకలు..



టైమ్స్ ఆఫ్ వార్తు-బాన్సువాడ

గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల 2003 -2004 సంవత్సర పదవ తరగతి పూర్వ విద్యార్థులు గురుపౌర్ణమి ఉత్సవాన్ని శ్రీ సరస్వతి శిశు మందిర్ బాన్సువాడ పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు చిరుకానుకలతో సత్కరించారు. ఈ పాఠశాలలో చదివినందుకు మేము క్రమశిక్షణతో మంచి జీవన పద్ధతిన జీవితంలో చాలా ఉన్నత స్థాయిలో స్థిరపడ్డామని పూర్వ విద్యార్థులు వారి అభిప్రాయాలను వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమ్య శృతి ,అర్చన,గౌతమి ,శిరీష ,పద్మ ,నిఖిల, రాజేష్ ,అభినయ్, నాగార్జున ,శివకుమార్,రాకేష్ ,పూర్వాచార్యులు సుదర్శన్, అనూష, హనుమాన్లు, ర మేష్, సుంకి విజయ లక్ష్మి, తదితరులు, పాల్గొన్నారు

## 40 దాటిన ప్రతి ఒక్కరు షుగర్, గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి

**ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్ అనే నినాదాన్ని పాటించాలి**

**ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సందీప్ రావు**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



40 ఏళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరు తరచూ మధుమేహ, గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సందీప్ రావు సూచించారు. రోటరీ క్లబ్ జెమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖలీల్వాడిలో గల తిరుమల నర్సింగ్ హెూమ్ సహకారంతో జెమ్స్ కుటుంబ సభ్యులకు ఎగ్జిక్యూటివ్ కార్డియాక్ చెకప్ నిర్వహించారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సందీప్ రావు పర్యవేక్షణలో ఈ క్యాంపు జరిగింది. ఈ ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ రావు మాట్లాడుతూ ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్ అనే నినాదంతో సగటు వయసు 40 దాటిన తర్వాత ప్రతి ఒక్కరు వారి గుండెకు సంబంధించిన పరీక్షలు, మధుమేహానికి సంబంధించిన పరీక్షలు చేయించుకొని సురక్షితంగా ఉండాలని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని తెలియజేశారు. ఇందులో భాగంగా 38 రోటేరియన్లు టెస్టులు చేయిం చుకున్నారు. రొటేరియన్ కుటు ంబాలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ స ందీప్ రావును రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో శ లువాతో సత్కరించి మెమొ ంటో బ హుక రిం చారు. ఈ కార్యక్రమ ం లో అ ధ్యక్షుడు ప ద్మ శ్రీనివాస్, కార్యదర్శి రాచకొ ం డ గౌరీశంకర్, కో శాధికారి కసుబ సంపత్ కుమార్, ప్రాజెక్ట్ చైర్మన్ డాక్టర్ అనంత్ కులకర్ణి, రంజిత్ సింగ్ ఠాగూర్ పాల్గొన్నారు.

## ప్రారంభోత్సవానికి హాజరైన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్..



టైమ్స్ ఆఫ్ వార్త-బాన్సువాడ

బాన్సువాడ నియోజకవర్గం బీర్కూర్ పట్టణ కేంద్రంలో శ్రీనివాస్ నూతన మొబైల్ షాప్ ను ఆదివారం ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ నాయకులు యమ రాములు , ఆరిఫ్ , రాఘు , రాజు పటేల్ , కిష్టాపూర్ పీరయ్య , తదితర నాయకులు, ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్ఫూర్తి ప్రదాత అవార్డు అందుకున్న కొండ సతీష్



టైమ్స్ ఆఫ్ వార్త-మందమర్రి

పట్టణానికి చెందిన కొండ సతీష్ సామాజిక సేవ రంగంలో అంతర్జాతీయ స్ఫూర్తి ప్రదాత అవార్డును అందుకున్నారు. కరీంనగర్ పట్టణంలో కరీంనగర్ కు చెందిన ఆర్యాణి సకల కళా వేదిక, మంథని కి చెందిన శ్రీ గౌతమేశ్వర సాహిత్య కళా సేవా సంస్థల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సతీష్ ను అంతర్జాతీయ స్ఫూర్తి ప్రదాత అవార్డుతో సత్కరించి, శాలువతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సతీష్ సేవలను కొనియాడారు. ఈకార్యక్రమానికి సభాధ్యక్షులుగా ప్రముఖ కవి, రచయిత, ఆర్యాణి ఫౌండర్, చైర్మన్ దూడపాక శ్రీధర్ వ్యవహరించగా, ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి, విమర్శకులు డాక్టర్ వైర్యాగం ప్రభాకర్, విశిష్ట అతిథిగా కవి, బహు గ్రంథకర్త ఎస్ సంపత్ కుమార్, గౌరవ అతిథులుగా ప్రముఖ పర్యావరణవేత్త పిట్టల రవిబాబు, గాయకులు ఎస్వీఆర్ డిజిటల్ చైర్మన్ ఎస్వీఆర్ వెంకటేష్, ప్రముఖ కవి, సమీక్షకులు పొర్ల వేణుగోపాల్ రావు, ప్రత్యేక అతిథులుగా గాయకులు, ఖమ్మం సర్వసుధ మ్యూజిక్ అకేషన్ ఉపాధ్యక్షులు వివి రెడ్డి, ప్రజా వైద్యులు, వైద్యరత్న శిరోమణి జాతీయ అవార్డు గ్రహీత ఎస్కే అన్వర్ హాజరై సతీష్ కు అవార్డును ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యాణి కళావేదిక ప్రధాన కార్యదర్శి మణి రాయల్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్లో రామాలయం హుండీ లెక్కింపు 6,837 రూపాయల ఆదాయం..



టైమ్స్ ఆఫ్ వార్తు-బాన్సువాడ

బాన్సువాడ నియోజకవర్గం బీర్కూర్లోని శ్రీ కోదండరామాలయంలో ఆదివారం రోజు హుండీ లెక్కించారు,68375రూపాయలు ఆదాయం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్య క్రమంలో సభ్యులు అవారి గంగారాం,మాజి ఎంపీపీ రఘు,సానేపు గంగారాం,మేకల విట్టల్, యామరాములు,పెండ్యాల శ్రీకాంత్,మేకల సురేష్,యామ చిన్నరాములు,భక్తులు, పాల్గొన్నారు.

# యోగా గురువులకు ఘన సన్మానం



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

గురుపౌర్ణమి సందర్భంగా నిజామాబాదు నగరంలోని వినాయకనగర్ లో ఆదివారం పతంజలి యోగ సమితి,భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగ గురువులకు సన్మానం చేశారు. యోగారత్న ఎక్కొండ ప్రభాకర్,యోగా గురువులు జె.కిషన్,జి.సాయన్న,బుచ్చన్న, సత్యనారాయణ గౌడ్, ఆంజనేయులు, జలంధర్ గౌడ్,రంజిత్,బంటు సంతోష్,నారాయణ, విజయ్ కుమార్ లకు ఘన సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ యోగకేంద్రాల యోగ సాధకులు పాల్గొన్నారు.

## రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురు పూర్ణిమ ఉత్సవాలు

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



శ్రీ రామకృష్ణ సేవా సమితి నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ ధ్యాన మందిరం గంగాస్టాన్ లో గురుపూర్ణిమ ఉత్సవాలు ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా రామకృష్ణ పూజ, ప్రమాణ మంత్రాల పఠనం భగవద్గీత ప్రవచనం గురు అవసరాన్ని, మరీ ముఖ్యంగా రామకృష్ణ పరమహంస సర్వ ధర్మ సాధనాలను అనుష్టించి అవతార వరిష్ఠాయగా కోరి పొందారని, అలాంటి గురువులు మనకు దొరకడం మన పూర్వజన్మ సుకృతమని, సద్గురు మనకు అజ్ఞానం నుంచి జ్ఞానం వైపునకు, చీకటి నుంచి వెల్తురుకు ప్రయాణించడానికి ఆధ్యాత్మిక గురు ఎంతో అవసరమని సమితి అధ్యక్షుడు సాయి ప్రసాద్ సూచించారు. భగవద్గీత పై వాక్యానం చేస్తూ గురు అవసరాన్ని, గొప్పతనాన్ని, గురుపైన భక్తితో భక్తి మార్గం ద్వారా కలియుగంలో సద్గురు ఉంటే మోక్షాన్ని భక్తీవారం ద్వారా కులంకషంగా పొందవచ్చని భగవద్గీత వ్యాఖ్యాత నారాయణ వివరించి చెప్పారు. ఈ సందర్భంగా హోమం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం శ్రీ రామకృష్ణ పరమహంస జీవిత చరిత్రపై చలనచిత్రం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు సాయి ప్రసాద్, ఉపాధ్యక్షుడు యోగా రామచందర్, సభ్యులు బచ్చు గోపాల్, కిషోర్ యాదవ్ శ్రీధర్, రాజేంద్రప్రసాద్ నాగేశ్వరరావు, నారాయణ, తోట రాజశేఖర్, జాదవ్ వసంత్ పాటిల్, గంగా ప్రసాద్, ప్రకాష్ గౌడ్, సురేందర్, యువకులు, భక్తులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం..

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



ఎడపల్లి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం గురు పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఎడపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన గురు పూజోత్సవ కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్మాస్టర్ రాజలింగం ను లయన్స్ క్లబ్ సభ్యులు శాలువలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ప్రతీ సంవత్సరం గురుపౌర్ణమి సందర్భంగా గురువులను ఎడపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించి,పూజించడం జరుగుతుందని లయన్స్ క్లబ్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అధ్యక్షులు మనోజ్ కుమార్ , కోశాధికారి గంగారెడ్డి, లయన్ పుష్పలత,లయన్ ప్రకాష్, లయన్ మెర్సీ(రాధ), తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి...



టైమ్స్ ఆఫ్ వార్త-బాన్సువాడ

వ్యాసపౌర్ణమి (గురుపౌర్ణమి) సందర్భంగా బాన్సువాడ పట్టణంలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవి ఆలయం, కల్కి చెరువు సాయిబాబా ఆలయం, నస్రుల్లాబద్ మండలం నెమ్లి సాయిబాబా ఆలయాలను సందర్శించి పూజలు చేసిన మాజీ శాసన సభాపతి, మాజీ మంత్రి, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి . ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు ,పోచారం శంభు రెడ్డి ,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు. తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ బోధన్ కు బదిలీ..



టైమ్స్ ఆఫ్ వార్తు - బాన్సువాడ

బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్నెంట్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఆదివారం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్నో ఏళ్లుగా సేవలు అందించి, మాత శిశు ఆసుపత్రిని జాతీయస్థాయిలో అవార్డు అందించడంలో ప్రముఖ పాత్ర పోషించారు.

# రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు 40 మంది విద్యార్థుల ఎంపిక



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్

రాష్ట్రస్థాయి టైక్వాండో ఛాంపించి పోటీలకు నిజామాబాద్ జిల్లాకు చెందిన 40 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లా కేంద్రం లోని మాధవ నగర్ లో గల బీ ఎల్ ఎన్ గార్డెన్ లో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ ఎంపికల ప్రక్రియ తైక్వాండో జిల్లా అధ్యక్షుడు బాజిరెడ్డి జగన్ మోహన్, ప్రధాన కార్యదర్శి, కోచ్ మనోజ్ కుమార్ పర్యవేక్షణలో జరిగాయి. ఈ పోటీల్లో 70 మంది క్రీడాకారులు పాల్గొనగా 40 మంది క్రీడాకారులు గోల్డ్ మెడల్, 20 మంది సిల్వర్, 10 మంది బ్రాంజ్ మెడల్స్ సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులు ఈ నెల 27, 28 తేదీల్లో హైదరాబాద్ లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకుఎంపికైనట్టు కోచ్ మనోజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి వెంకటరమణ పాల్గొనగా నేహా, గయాజ్ రెఫరీలుగా వ్యవహరించారు.

## చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి

### రెస్క్యూ చేసి మృతదేహాన్ని వెలికి తీసిన అగ్నిమాపక సిబ్బంది





టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ క్రైమ్

చేపల వేట కోసం వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకెళ్తే.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారంలో గల 80 క్వార్టర్ల ప్రాంతంలో ఉన్న చెరువులో ఎస్కే అక్బర్ (26) అనే వ్యక్తి చేపల వేట కోసం వెళ్ళాడు. ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి మృతి చెందగా స్థానికుల సమాచారం మేరకు నిజామాబాద్ అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా సిబ్బందికి వెంటనే హుటా హుటిన సంఘటన స్థలమునకు చేరుకున్నారు. ఇందులో భాగంగా అగ్నిమాపక సిబ్బంది రిస్కు ఐటమ్స్, రూమ్స్, లైఫ్ బాయ్స్ లైఫ్ జాకెట్స్ ధరించి పాతాళగారిగతో గంటల పాటు ప్రయత్నించి మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని వెలికి తీశారు. ఇందులో అగ్నిమాపక శాఖ రెస్కూ టీం పీ. నర్సింగ్ రావు స్టేషన్ ఫైర్ ఆఫీసర్, అనంతరావు లీడింగ్ ఫైర్ మాన్, ప్రశాంత్ డ్రైవర్, ఆపరేటర్ ప్రసన్న కుమార్ ఫైర్ మాన్, సతీష్ ఫైర్ మాన్ ఈ గ్రూప్ అగ్నిమాపక రెస్క్యూటివ్ బృందం ఉన్నారు.

## జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం అధ్యక్షునిగా పసుమర్తి కిషోర్

### -మహాసభ ఉపాధ్యక్షుడిగా కోదుమూరి సత్యనారాయణ

### -మహాసభ గౌరవ అధ్యక్షులుగా శేషగిరిరావు దారా వెంకటేశ్వరరావు

చంద్రుగొండ టైమ్స్ అఫ్ వార్త





ఆదివారం కొత్తగూడెం ధారా ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య మహాసభ సమావేశం హట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా మహా సభ యువజన సంఘ అధ్యక్షునిగా పసు మర్తి కిషోర్‌ను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు మహాసభ గౌరవ అధ్యక్షులుగా పసు మర్తి శేషగిరిరావు,దారా వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. అనంతరం మహాసభ ఉపాధ్యక్షునిగా కొదమూరు సత్య నారాయణ కార్యవర్గ సభ్యులుగా కుక్కడపు హరిబాబు,పెనుగొండ నరసింహారావువనమా సత్య నారాయణ, నాగరాజు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పసుమర్తి కిషోర్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని చంద్రుగొండ మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పసుమర్తి శేషగిరిరావు, సంకా కృపాకర్, శంకర్,కోదుమూరు జనార్ధన్,కొదమూరు తిరు మలరావు, కోదుమూరి దయాకర్,దూపుకుంట్ల రామారావు,లగడపాటి రంగారావు తెలిపారు.

## భారీ వర్షాల నేపథ్యంలో రాపిడ్ యాక్షన్ టీం ఏర్పాటు

టైమ్స్ ఆఫ్ వార్త- మందమర్రి

రాబోయే భారీ వర్షాలు విపత్తు నివారణ చర్యల్లో భాగంగా సహజ సంఘటనలు సంభవించే అవకాశం ఉండటంతో ప్రజల సౌకర్యార్థం పట్టణ మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు రాపిడ్ యాక్షన్ టీం ను ఏర్పాటు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సూపర్వైజర్ అధికారులుగా పారిశుద్ధ్య నిర్వహణకు మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ వి శ్యాంసుందర్,హెల్త్ అసిస్టెంట్ ఎంఎస్ సమీర్,ఇంజనీర్ విభాగం మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ అచ్యుత్,టౌన్ ప్లానింగ్ విభాగం సంబంధించి బి రాజ్ కుమార్ టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్‌ను నియమించడం జరిగిందన్నారు. వీరికి సపోర్టుగా టీం సభ్యులు,ఇతర కార్మికులను కేటాయించినట్లు తెలిపారు. ఈ బృందాలకు అవసరమైన సాధనాలు సున్నం,బ్లీచింగ్ పౌడర్ మొదలైన వాటితో 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. వర్షాకాలంలో అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు,శిథిలావస్థలో ఉన్న గృహాలు,కూల డానికి సిద్ధంగా ఉన్న పాత గోడలు మొదలగు వాటిని, నిర్వాసిత ప్రజలను గుర్తించి,స్పందిస్తాయని తెలిపారు. హెల్ప్ డెస్క్ సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సహాయం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 18004253611,ల్యాండ్ లైన్ నెంబర్ 08736-293611లను అత్యవసర సందర్భాల్లో ప్రజలు సంప్రదించాల్సిందిగా సూచించారు.

## గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా గుడి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహణ

టైమ్స్ ఆఫ్ వార్త - వలిగొండ



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శిరిడి సాయిబాబా మందిరం దేవాలయం లో గురు పౌర్ణమి సందర్భంగా ఈరోజు మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఇన్చార్జి అనురాగ్ ఆధ్వర్యంలో సాయి సేవ పురోహితులు డాక్టర్ దశరథసారు సాయి సేవ పురోహితులు మానస. సాయిబాబా గుడి పూజారి ఆంజనేయులు సాయి పంతులు. సారథ్యంలో గురుపౌర్ణమి అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల పరిధిలోని భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజ వ్రతంలో పాల్గొని గురు పౌర్ణమి విజయవంతం చేసినారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు సంఘం చైర్మన్ సోమనబోయిన సతీష్ మంగమ్మ. గౌరవ అధ్యక్షులు బోళ్ల రామచంద్రయ్య అంజమ్మ. డైరెక్టర్లు బుంగమాట్ల కిష్టయ్య కనకబోయిన అంజయ్య మోటే సంజీవ. మరియు నిమ్మల వెంకటేశ్వర్లు బుంగమట్ల ఆనందు తాళ్ల శ్రీనివాస్ మాటూరి వెంకన్న పిట్టల రాజు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలి

### ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేయాలి

టైమ్స్ ఆఫ్ వార్త - వలిగొండ



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు మారగోని శ్రీను సారథ్యంలో విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర కమిటీ అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు. మీడియాతో ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఉద్యమకారుల సమస్యలపై ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో ప్రకటన చేయాలని. తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలని. ఉద్యమకారులకు .ఐడెంటి కార్డు ఏర్పాటు చేయాలని. ప్రతి నెల పెన్షన్ 25000 వచ్చేలా నిర్ణయం తీసుకోవాలని ఇల్లు లేని వారికి 250 గజాల స్థలంతో పాటు ఇండ్లు మంజూరు చేయాలని. మీడియాతో మాట్లాడినారు. ఈ ప్రెస్ మీట్ లో మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్కే చాంద్. మహిళా అధ్యక్షురాలు గంధమల్ల మల్లమ్మ. ఐటి పాముల పుష్ప జిల్లా నాయకులు మల్లం వెంకటేశం మంటి రమేష్ ఎక్కల దేవి శ్రీనివాస్ బందారపు రాములు శ్రీనివాసాచారి మంటి లింగయ్య మంటి శంకర్ ఈతప మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ మాట అంగన్వాడి బాట నిర్వహణ

టైమ్స్ ఆఫ్ వార్త - వలిగొండ



వలిగొండ మండల కేంద్రంలోని అంగన్వాడీ టీచర్ ఏడవకేంద్రంలో పబ్బు నాగమణి ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించినారు. అంగన్వాడి టీచర్ నాగమణి మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేయించడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరినారు. ఈ సందర్భంగా ఈసీసీ ఈ డే నిర్వహించి తల్లిదండ్రులకు పిల్లల భవిష్యత్తు అక్షరాభ్యాసం వారి క్రమశిక్షణ పిల్లలకు ఎలా అలవాటు చేయాలో తల్లిదండ్రులకు వివరించినారు . తరువాత పూల మొక్కలను నాటినారు .ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ తెరిసా తల్లిదండ్రులు నికిత మాధవి ఆశ అనిత షాజా ఉమా రామ ఎస్.కె షాజా పాల్గొన్నారు.



జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం,
22-07-2024


# ఆ ప్రాంగణాలు బురదమయం..

- పిహెచ్సి వెళ్లాలంటే ఫీట్లు కొట్టాల్సిందే..!
- స్కూలుకు వెళ్లాలంటే స్కేటింగ్ చేయాల్సిందే...!
- ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది,విద్యార్థులు...
- పట్టించుకోని అధికారులు....









టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వైద్యం నిమిత్తం రోగులు వస్తూ పోతూ ఉంటారు. అలాగే మండలంలోని మంగల్పాహాడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు వస్తూ ఉంటారు. గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు ఈప్రాంగణాలు బురదతో రొచ్చుగా మారాయి. దీంతో పిహెచ్సి వైద్యం నిమిత్తం వచ్చి వెళ్తు వుండే వారికి నరకంలా మారింది.గతంలో ఈ ప్రాంగణం బయట అంతా లోతట్టు మయంగా ఉండేది. వర్షాలు పడితే చాలు ఆప్రాంగణం బయట అంతా చెరువును తలపించేది. గతంలో నూతనంగా డ్రైనేజీ నిర్మించారు. దీంతో పిహెచ్సిలో తట్టుగా మారింది. వర్షాల సమయంలో నీరంతా ఆ ప్రాంగణంలోకి చేరి బురద మయంగా మారింది. దీంతో ఎక్కడ పడితే అక్కడ బురదతో రొచ్చుగా మారి పిహెచ్సికి వైద్యం నిమిత్తం వచ్చిన వారు జారి బురదలో పడిపోతున్నారు. ప్రతిరోజు వచ్చే రోగులు,గర్భిణీలు, వైద్యసిబ్బంది ఎక్కడ జారీ పడిపోతామో అని ఆందోళన చెందుతున్నారు.ఆ ప్రాంగణంలో అడుగు పెట్టాలంటే గాలిలో ఫీట్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ప్రజలు అంటున్నారు. అలాగే మంగల్పాహడ్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సైతం వర్షం నీరు నిలవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు స్కేటింగ్ చేయాల్సి వస్తుందని తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వ ఇంజనీరింగ్ వ్యవస్థను ఉపయోగించుకుని వర్షం నీరు సక్రమంగా బయట మురుగు కాల్వలకు చేర్చడంతో పాటు, కార్యాలయాల ప్రాంగణాలు శుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అమెజాన్ పేరా నగదు చోరీ..

### రూ.79లకు బదులు రూ.13215 బదిలీ..



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

ఇన్స్టాగ్రామ్ లో వచ్చిన లింక్ ను క్లిక్ చేస్తే అకౌంట్ లో నుండి నగదు బదిలీ అయిన ఘటన ఎడపల్లి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది.వివరాలిలా ఉన్నాయి... మండలానికి చెందిన ఓవ్యక్తి ఫోన్ కు అమెజాన్ లో ఇయర్ పాట్స్ రూ.79లకే ఇన్స్టాగ్రామ్ లో మెసేజ్ రావడంతో తక్కువ ధరకే ఇయర్ పాట్స్ వస్తున్నాయని లింక్ ను క్లిక్ చేసాడు. పేమెంట్ చేయాలని అడగగానే క్రెడిట్ కార్డ్ ద్వారా రూ.79 పేమెంట్ చేసాడు. దీంతో అమెజాన్ లోకి వెళ్ళకుండా వైల్డ్ హబ్ స్ట్రీమింగ్ డాట్ కామ్ సైట్ లోకి వెళ్లి అతని క్రెడిట్ కార్డ్ అకౌంట్ లో నుండి రూ.13215.79 డెబిట్ అయ్యాయి.దీంతో అవాక్కైన ఆవ్యక్తి చేసేదేమీ లేక ఎస్సైకు పిర్యాదు చేసాడు.

## బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువుల పంపిణీ

### ఆపదలో అండగా ఉంటాను పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

టైమ్స్ఆఫ్ వార్త-రాయపర్తి:



రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటమ్మ మరణించగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్ టీం ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద కుటుంబానికి నిత్యవసర సరుకులు, ఒక క్వింటా బియ్యము పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబాలకు సేవలు చేస్తున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎస్టి సెల్ ఉపాధ్యక్షుడు సురేంద్ర రాథోడ్ నాయక్ మాట్లాడుతూ బాధిత కుటుంబ సభ్యులకు ఎలాంటి అవసరాలు ఉన్న ఆదుకుంటామని తెలిపారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, మా కుటుంబ ఆర్థిక పరిస్థితి, మా అవసరాన్ని గుర్తించి ఆదుకున్నందుకు ఎల్లప్పుడు వారికి రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కిరణ్ కుమార్ రెడ్డి, ఎన్ఎస్ యుపిఎస్ సి సుధాకర్, గ్రామ పెద్దలు కుందూరు జయపాల్ రెడ్డి, తాటిపల్లి నాగేష్, బిక్షపతి, చిట్యాల వెంకన్న, బూడిద మహేష్, బుచ్చిరెడ్డి గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర నాయకులు పైల్ల రాజా వర్ధన్‌రెడ్డి అమెరికా పర్యటన

### సాధారణంగా ఆహ్వానించిన ఎన్నారై మిత్రులు. పైల్ల వెంకటరెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - వలిగొండ



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని సుంకి శాల గ్రామానికి చెందిన రాష్ట్ర నాయకులు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పైల్ల రాజ వర్ధన్ రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా అక్కడికి వెళ్ళిన సందర్భంలో అక్కడి తెలంగాణ ఎన్నారై మిత్రులు ఎన్ఆర్ఐ వెంకట్ రెడ్డి మరి కొందరు మిత్రులు పైల్ల రాజా వర్ధన్ రెడ్డిని వారి కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా శాలువాతో ఘనంగా సన్మానించి సాధారణ స్వాగతం పలికినారు.

## వనస్థలిపురంలో ఘనంగా బాబ్స్ బిర్యాని ప్రారంభోత్సవం

టైమ్స్ ఆఫ్ వార్త - ఎల్బీనగర్ ప్రతినిధి:




వనస్థలిపురం డివిజన్ పరిధిలోని రైతు బజార్ రోడ్డు గౌతమి నగర్ లో బాబ్స్ బిరియాని అండ్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ను ఆదివారం ఘనంగా ఈ సందర్భంగా బాబ్ బిరియాని నిర్వాహకులు ఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ వనస్థలిపురం పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యత రుచితో కూడిన బిర్యాని ఫాస్ట్ ఫుడ్ వంటకాలను అందరికీ అందుబాటు ధరలు అందించేందుకు వనస్థలిపురంలో ఏర్పాటు చేయడం జరిగిందని ఈ అవకాశాన్ని సమీప కాలనీలా ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి దీంతోపాటు జొమాటో స్విగ్గి ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆన్లైన్ సేవల కొరకు 9989351067 నెంబర్లులో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సమాజాన్ని సరైన మార్గంలో నడిపించే దైవ సామానులు గురువులు

### సామాజిక కార్యకర్త మోడెం కుమారస్వామి

టైమ్స్ఆఫ్ వార్త-వర్ధన్నపేట:



సమాజాన్ని సరైన మార్గంలో నడిపించే దైవ సమానులు గురువులేనని, గురువులు బోదించిన విద్య ప్రతి విద్యార్థి జీవితానికి దిక్సూచి అని, గురువులు విద్యను బోధించి, విద్యార్థుల ఎదుగుదలను, అభివృద్ధిని, ఉన్నత శిఖరాలను చూసి నిస్వార్థంగా ఆనందపడి, అభినందించే వారు గురువులని, అలాంటి గువులను గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని సామాజిక కార్యకర్త మోడెం కుమారస్వామి కొనియాడారు. గురు పౌర్ణమి, వ్యాస పూర్ణిమ సందర్భంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలో కీ.శే. అనుమాస కొమురయ్య స్మారక సమితి ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమారస్వామి, అనుమాస ప్రేమ్ ప్రసాద్, నకరకంటి రవీందర్, ఆబర్ల సాయిలు, శ్రీనివాస్, గణేష్, శివ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పెనుభూతమైన అనుమానం..

అనుమానంతో కట్టుకున్న భార్యను, 11 నెలల చిన్నారిని హత్య చేసి తాను కూడా ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బోయిన్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని డె క్లూరు కీనీపోస్ట్ ప్రాంతానికి చెందిన గణేష్ సంగ్రామ్ (35), భార్య స్వప్న (30) ముగ్గురు కుమార్తెలు త్రివేణి (6) తనుశ్రీ (4) నక్షత్ర 11 నెలల పాపతో కలిసి కూరగాయా ల ఆటోను నడుపుకుంటూ న్యూబోయిన్‌పల్లి పెద్ద తొక్కట్టలో నివాసం ఉంటున్నాడు. గత కొన్ని రోజులుగా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో తరచూ భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో ఆదివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో భార్యతో పాటు 11 నెలల పాపను తాడుతో గొంతుకు బిగించి హత్య చేశాడు. ఆపై తాను నివాసం ఉంటున్న ఇంటి యజమాని సువర్ణను నిద్ర లేపి తనకు రోడ్డు ప్రమాదం జరిగిందని, తన అమ్మనాన్నలకు తెలియజేయాలని చెప్పాడు.

## వలిగొండ బస్టాండును పునరుద్ధరించాలి

### అన్ని వైపులకు వెళ్లే బస్సులు ఇక్కడ ఆగేవిధంగా ఏర్పాటు చేయాలి

### స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చొరవ తీసుకోవాలి

టైమ్స్ ఆఫ్ వార్త - వలిగొండ



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కేంద్రంలో ఉన్న బస్టాండు ను వెంటనే పునరుద్ధరించాలని అన్ని వైపులకు వెళ్లే బస్సులు ఇక్కడ ఆగటం లేదు. ప్రయాణికులు చాలా ఇబ్బందికి గురవుతున్నారు. ముసలివారు సెంటర్ వరకు నడవలేకపోతున్నారు. అన్ని వైపులకు వెళ్లే బస్సులు ఇక్కడ ఆగే విధంగా డిపో మేనేజర్ తోటి మాట్లాడి ప్రయాణికులకు వెసులుబాటు ఉండే విధంగా ఏర్పాటు చేయాలని. ఇక్కడి ప్రయాణికుల అవస్థలు అర్థం చేసుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చొరవ తీసుకొని బస్టాండ్ పునరుద్ధరించి బస్సులు అన్ని వైపులకు వెళ్లే బస్సులు ఇక్కడ ఆగే విధంగా ఏర్పాటు చేయాలని స్థానిక ప్రయాణికులు రావుల సబితా రెడ్డి పత్రిక ప్రకటనలో ఎమ్మెల్యేని కోరినారు.

## డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షాలకే ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)..

అభరు కుష్వాహ, జేడీయూ ఎంపీ సంజరు ఝా సహా పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

నేటి నుంచి ప్రారంభమయ్యే సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ఆర్థిక సర్వేను, మంగళవారం కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. కాగా నీట్ పేపర్ లీక్ కేసు నుంచి రైల్వే భద్రత వరకు సమస్యలపై ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఐక్య ప్రతిపక్షం సిద్ధమైంది. ఆగస్టు 12 వరకు 19 రోజులు ఈ సమావేశాలు జరుగనున్నాయి.

## విద్యుత్ షాక్‌తో ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి

విద్యుత్ షాక్‌తో ఒకే కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. .అనంతపూర్ జిల్లా, హిందూపూర్‌కు చెందిన వెంకటేశ్వ ర్లు కుటుంబం చాలాకాలం క్రితం నగరానికి వచ్చి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ సనత్‌నగర్ జెక్ కాలనీలోని ఆకృతి రెసిడెన్సీలో నివాసం ఉంటున్నారు. వెంకటేశ్వర్లు (60)కు భార్య మాధవి (50) కుమారుడు హరికృష్ణ (32) ఉన్నారు. కుమారుడు హరికృష్ణ మానసిక సమస్యతో బాధపడుతూ తన స్వంత పనులు కూడా చేసుకోలేని స్థితిలో ఉన్నాడు. దీంతో ప్రతిరోజులాగే మాధవి ఆదివారం కుమారుడిని స్నానం చేయిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. బాత్‌రూమ్ ను ంచి కేకలు వినిపించడంతో తండ్రి వెంకటేశ్వరరావు కూడా లోనికి వెళ్లడంతో అతను కూడా విద్యుత్ షాక్‌తో మృతి చెందాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

## కాళేశ్వరంపై కావాలనే కాలయాపన

(మొదటి పేజీ తరువాయి)..

ఎన్‌డిఎస్‌ఎ సూచనలతో.. జూన్ రెండో వారంలో కేంద్ర ప్రభు త్వ సంస్థలు సిడబ్ల్యూపిఆర్ఎస్, సిఎస్ఎంఆర్ఎస్‌లతో సాంకేతిక పరీక్షలు చేయించాలని నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం రెండు సంస్థలు సాంకేతిక పరీక్షలకు ఉపక్రమించే స మయానికి వరద రావడంతో టెస్టులు ఆపివేసినట్టు ఉత్తమ్ పేర్కొనడం గమనార్హమని, ఈ వైఫల్యానికి ఎన్‌డిఎస్‌ఎ నిర్లక్ష్య వైఖరి కారణమైతే, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ వైఫల్యానికి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. శంఖంలో పోస్తేనే తీర్థం అవుతుందన్నట్టు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ వారు చెప్పినవే పరిష్కారాలు అని ప్రభుత్వం కూడా భావించి రాష్ట్ర ఇంజనీర్లను ముందుకు సాగనివ్వలేదని మండిపడ్డాఉ. గోదావరికి వరదలు రాకముందే బ్యారేజీకి సరైయిన రక్షణ చర్యలు తీసుకోవలసిన ప్రభుత్వం ఎన్‌డిఎస్‌ఎ నివేదిక కోసం ఎదురు చూస్తూ 4 నెలల విలువైన కాలాన్ని వృథా చేసిందని, ఇప్పుడేమో వరదల కారణంగా పరీక్షలు ఆపివేశామని చెప్పడం బాధ్యతా రాహిత్యం కాదా..? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంపై, తెలంగాణ ఇంజనీర్లపై బురద జల్లే ప్రయత్నమే తప్ప బ్యారేజి పునరుద్దరణకు నిర్మాణాత్మక సూచనలు చేయడంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ దారుణంగా విఫలమైందని ఆరోపించారు. వారి నుంచి నివేదికను తెప్పించుకోవడంలో ప్రభుత్వం కూడా తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని పేర్కొన్నారు. ఈ వరదల్లో మేడిగడ్డ బ్యారేజీకి ఏదైనా ప్రమాదం వాటిల్లితే బాధ్యత ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. రక్షణ చర్యలు చేపట్టడంలో విఫలం చెందడమే కాక తమ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడం ఇంకా ఎంతకాలం చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వానాకాలం ముగిసే నాటికి ఎన్‌డిఎస్‌ఎ నుంచి శాశ్వత రక్షణ చర్యలకు సంబందించిన నివేదికను తెప్పించుకోవడం పట్ల శ్రద్ధ వహించాలని ఉత్తమ్‌ను కోరారు.

## ఎడతెరిపివ్వని వాన

(మొదటి పేజీ తరువాయి)..

ఉధృతంగా ప్రవహించడంతో పర్ణశాల వద్ద నార చీరల ప్రాంతం వరద నీటిలో మునిగింది. భద్రాచలం నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు వెళ్లే ప్రధాన రహదారి చట్టి వద్ద వరద నీరు చేరడంతో రాష్ట్రాలకు రాకపోకలు నలిచిపోయాయి.

### నిండుకుండలా హుస్సేన్‌సాగర్

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నిండు కుండలా మారింది. దాంతో మారియట్ హౌటల్ వద్దనున్న మత్తడి వద్ద భారీగా దిగువకు దూకుతోన్న నీటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపడంతో సందడి నెలకొంది.సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 514.75 మీటర్లు కాగా ప్రస్తుతం 513.23 మీటర్లు నమోదైంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు





టైమ్స్ఆఫ్ వార్త-వర్ధన్నపేట:

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని 7వ డివిజన్ కోనపురంకు చెందిన మేడ శివ 18 సంవత్సరాలు హైదరాబాదులో రోడ్డు ప్రమాదంలో మరణించగా, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు విషయం తెలుసుకొని వారి పార్థివదేహానికి పూలమాలవేసి, నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మన్నె బాబురావు, మాజీ జెడ్పిటిసి కమ్మగొని ప్రభాకర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్, పట్టణ కేంద్రం కాంగ్రెస్ నాయకులు చీటూరి రాజు, వెలికట్టే ముత్తయ్య, నిఖిల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.